కొన్ని పడక.. ఇంకొన్ని నత్తనడక

పాతవి ముందుకు సాగవు.. కొత్తవి మొదలుకావు

బిల్లులు రావడంలేదని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

ఇదీ కవాడిగూడ డివిజన్ అభివృద్ధి పనుల దుస్థితి



పిల్లర్ గుంతల స్థాయిలో నిలిచిపోయిన ఉన్నికోట కమ్యూనిటీ హాల్ పనులు

కవాడిగూడ: కొత్త పనులు మొదలు కావు. పాత వాటికి బిల్లులురావు. మధ్యలో ఆగిన పనులు మళ్లీ సాగడంలేదు. కొన్ని పడకేశాయి. మరికొన్ని నత్తనడకన సాగుతున్నాయి. ఆర్భాటంగా వేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి. ఇదీ కవాడిగూడ డివిజన్ దుస్థితి. అసెంబ్లీ ఎన్నికల ముందు పలుచోట్ల హడావుడిగా ప్రారంభించిన పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో కొత్త పనుల నిమిత్తం టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. పాత బిల్లులకే దిక్కు లేదు. కొత్త పనులు ఎలా చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. అనేక బస్తీలలో మొదలుపెట్టిన పనులు సైతం మధ్యలో నిలిచిపోయాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- ఉన్నికోట బస్తీ: అసెంబ్లీ ఎన్నికల ముందు ఉన్నికోటబస్తీలో హడావిడిగా రూ.కోటీ 10 లక్షలతో కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేయగా పిల్లర్‌గుంతల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి.

ఇందిరాపార్కులో..

ఇందిరాపార్కులో సుమారు రూ. 50 లక్షలతో స్కేటింగ్ గ్రౌండ్ పనులు ప్రారంభించగా అవి నేటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి.



గగన్‌మహల్‌లో..

గగన్‌మహల్‌లో పార్కు అభివృద్ధి పనులు, సీసీ రోడ్డు, జిమ్ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ అవి నేటికీ ప్రారంభం కాకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం

కొన్నిరోజుల క్రితం శంకుస్థాపన చేసిన కమ్యూనిటీ పనుల గురించి అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
– కార్పొరేటర్ జి.రచనశ్రీ

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించాలి



చాలాఏళ్లుగా ఉన్నికోట బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలంటూ విన్నవించగా మంజూరైన కమ్యూనిటీ హాల్ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను త్వరగా చేపట్టి పూర్తి చేయాలి.
– మాధవి, స్థానిక మహిళ

మాజీస్పీకర్ శ్రీపాదరావుకు నివాళులు



నల్లకుంట: నక్సలైట్ల దాడిలో మృతి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని శనివారం నల్లకుంటలోని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, మాట్లాడారు. శ్రీపాదరావు మంత్రిగా, స్పీకర్‌గా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్న ఆయన నక్సలైట్ల దాడిలో మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో టీబీఎస్ఎస్ ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, ఆర్‌కే, దేశ్‌ముఖ్, జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్, మంత్రి సునీల్, గుండమరాజు సత్య ప్రకాష్, సూర్యాపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దేవులపల్లి శేష కుమారి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న భిన్నూరి ప్రశాంత్

నల్లకుంట: నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్.కేతన శ్రీవల్లీ ఇండియన్ మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించింది. అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతున్న ఆమెను శనివారంతెలంగాణ బ్రాహ్మణ పరిషత్(టీబీపీ) రాష్ట్ర అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య, కోశాధికారి భిన్నూరి ప్రశాంత్ తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు రూ.50 వేల చెక్కును అందజేశారు. కృష్ణ చైతన్య, ప్రశాంత్ మాట్లాడుతూ మహిళా సాధికారత, మెడిసిన్ సర్వీసెస్, విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాలలో యువతని ప్రోత్సహించే విధంగా టీబీపీ ప్రణాళికతో ముందుకు పోతుందన్నారు. ఏప్రిల్‌లో జరగనున్న 7వ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ ట్రైనింగ్ క్యాంపునకు వెళ్లేందుకు ఆమెకు అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దీపన్నగారి శిరీష్, కొట్ర సతీష్, మహేష్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌కు సమస్యలపై వినతి



వినతిపత్రం అందజేస్తున్న లైబ్రరీ ఔట్ స్సోరింగ్ ఉద్యోగులు

చిక్కడపల్లి: తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు ఆదివారం సాయంత్రం పీఆర్‌సీ కమిటీ అధ్యక్షులు, మాజీ ఐఏఎస్ అధికారి శివ శంకర్‌ను కలిసి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సమాన పనికి సమాన వేతనం, సంవత్సరానికి వెయ్యి రూపాయల ఇంక్రిమెంట్, ఉద్యోగభద్రత కల్పించాలని చైర్మన్‌ను కోరినట్లు సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి సుగ్రీవ, కార్యవర్గసభ్యులు రాజేష్ తెలిపారు. తమ సమస్యలపై చైర్మన్ సానుకూలంగా స్పందినట్లు వారు వివరించారు.

జగదేకవీరుని కథ దృశ్యకావ్య ప్రదర్శన



నటి శ్రీదేవి, కళాకారులతో అక్కిరాజు సుందరరామకృష్ణ, రఘు, త్రినాథరావులు

చిక్కడపల్లి: వీణాపాణి కళానిలయం, వీనస్ జెమ్స్, బీట్స్‌ల సంయుక్తాధ్వర్యంలో త్యాగరాయ గానసభలో శనివారం నిర్వహించిన జగదేకవీరుని కథ దృశ్యకావ్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. స్వరజతుల లయ విన్యాసం అభినయ విలాసం శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ప్రముఖ నటి ప్రొఫెసర్ జీఎం శ్రీదేవి జగదేకవీరుని కథ పాటకు అనుగుణంగా నిర్వహించిన అభినయం రంజింపజేసింది. వెంకటస్వామి రావణబ్రహ్మ ఏకపాత్రాభినయం సభికులను అలరించింది. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ, రచయిత రఘు, ఎస్బీఐ రిటైర్డ్ ఏజీఎం త్రినాథరావులు, ప్రొఫెసర్ శ్రీదేవిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖనటుడు జంగయ్యగౌడ్, గాంధీ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న వేముల వెంకటేష్

కాచిగూడ: అన్ని రంగాల్లో వెనుకబడి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న 20 లక్షల మంది వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞాపనపత్రం అందజేశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరలకు మైనింగ్‌పై 20 శాతం ఇచ్చిన రిజర్వేషన్లను అమలు చేయాలని, ప్రభుత్వ పనుల్లో 15 శాతం రిజర్వేషన్లు కలిప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని ఒకటిన్నర శాతానికి కుదించి అన్యాయం చేసిందని ఆరోపించారు. మైనింగ్ కార్పొరేషన్, వడ్డెర ఫెడరేషన్‌లను ఏర్పాటు చేసి చైర్మన్లుగా వడ్డెరలను నియమించాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో సంఘం నాయకులు పిట్ల శ్రీధర్, వల్లెపు శివకుమార్, బండారు కుమార్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగ రాములుగౌడ్‌కు నివాళి

ఘనంగా వంగ రాములుగౌడ్ సంస్మరణసభ



వంగ రాములుగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న గౌడ సంఘాల నేతలు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: జాతీయ గౌడ సంఘాల జేఏసీ సలహాదారులు వంగ రాములుగౌడ్ సంస్మరణసభ సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, జాతీయ గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాములుగౌడ్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వంగ రాములుగౌడ్ గౌడ సంఘాలకు, గీత కార్మికుల సమస్యలపై చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో గౌడ హాస్టల్స్ అధ్యక్షులు చక్రవర్తిగౌడ్, గోప ప్రధాన కార్యదర్శి బండి సాయన్న, ముద్దగౌని రాంమోహన్‌గౌడ్, మోత్ర ఏడుకొండల్, శ్రావణ్‌గౌడ్, నేతి రాజేందర్‌గౌడ్, వంగాల బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిసాలలో సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే గోపాల్



రిసాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

మంచినీటి, పారిశుధ్యంపై ప్రజల ఫిర్యాదులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ రిసాలలో శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంచినీటి సమస్య, చెత్త కుప్పలపై స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మరో పది రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద, ముస్లీం గ్రేవియార్డ్స్, గల్లీలలో చెత్త కుప్పలు తొలగించాలని, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని స్థానిక అధికారులను కోరారు. విద్యుత్ స్తంబాలు కొన్ని ఒరిగిపోయి ఉన్నాయని, మరికొన్ని నిరుపయోగంగా మారాయని వాటిని వెంటనే చక్కదిద్దాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, శంకర్‌ముదిరాజ్, ఆలందార్ హుస్సేన్, ముదిగొండ మురళీ, సయ్యద్ ఇలామ్‌హుస్సేన్, కేశవపురం అరుణ్, డేవిడ్ రాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, ఏఎంవోహెచ్ మైత్రేయి, మేనేజర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరు గ్యారంటీలు

చిక్కడపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీల పథకం అమలవుతుందని రాజీవ్‌గాంధీ నగరపాలక గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుర్రం శంకర్ అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని బాపునగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు విద్యుత్ ఉచితం వంటి పథకాలపై ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు సుబ్బారావు, నర్సింగరావు, యాదగిరిగౌడ్, రాజశేఖర్, వేణు, భాస్కర్‌రెడ్డి, జాని, రాహుల్, దినేష్, వీరమణి, పద్మ, సుమితలు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

కాచిగూడ: చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ మనోజ్‌రెడ్డి పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ పద్మజ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో పిల్లలు, వారి తల్లిదండ్రులు, వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. 0–5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్సుబాయి, ఏఎస్ఎంలు సుహాసిని, ఇందిరా, జయలక్ష్మీ, రాధ, సునీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు



కాచిగూడ: ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆంధ్ర మహిళాసభ అధ్యక్షురాలు ఎస్.ఉషారెడ్డి అన్నారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఉమెన్స్ కాలేజ్ అలూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడలోని కళాశాల ప్రాంగణంలో ఇన్‌స్పైర్ పేరుతో నిర్వహించిన అలూమిని ఫెస్ట్ -2024లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వై.పద్మావతి, డాక్టర్ జీవీకే దుర్గా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతదేవి, హెచ్ఎంవీఎస్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, కార్యదర్శి కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి.సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న కోరివి వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదానం

కాచిగూడ: మహాశివరాత్రి సందర్భంగా కొరివి వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన శనివారం ఉదయం 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, కాసుల వినోద్ తెలిపారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మాజీ చైర్మన్ మేక దామోదర్ రెడ్డి, కాసుల మల్లికార్జున్, నర్రా సాయికృష్ణ, మార్గం విజయ్ కుమార్, మించు ఆనంద్ రావు, గోపిశెట్టి శ్రీనివాస్, బైరెడ్డి తదితరులతో కూడిన ప్రతినిధి బృందం ఏర్పాట్లను పరిశీలించారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వీరభద్ర సేవా సమితి వ్యవస్థాపకురాలు కాసుల అనసూయమ్మ ఘనంగా నివాళులర్పించారు.

నేడు మూడు పార్టీల విలీన మహాసభ



ఖమ్మంలో జరిగే మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాపంథా నాయకులు

ముషీరాబాద్: సీపీఐఎంఎల్ ప్రజాపంథా, సీపీఐ ఎంఎల్ ఆర్ఐ, పీసీసీ పార్టీల విలీన మహాసభ మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు ప్రజాపంథా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3వ తేదీన 25 వేల మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, 4, 5 తేదీలలో ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో విలీన మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు.



అభినందనలు

ముషీరాబాద్: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఆయన కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనిల్‌కుమార్‌ను కలిసిన వారిలో మల్లికార్జున్‌రెడ్డి, యాదగిరిగౌడ్ తదితరులున్నారు.

అల్పాహారం పంపిణీ



విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

ముషీరాబాద్: రాజాపేట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేపట్టిన అల్పాహార పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఆంజనేయులు, మండల విద్యాశాఖాధికారి చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవంతంగా విజయసంకల్ప యాత్ర



విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న కిషన్ రెడ్డి

కాచిగూడ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని, నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా నుంచి విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి మహిళలు విజయ తిలకం దిద్ది మంగళహారతులతో స్వాగతం పలికారు. యాత్ర కాచిగూడ, ఫీవర్ హాస్పిటల్, నల్లకుంట మీదుగా అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాకు చేరుకుంది. కాచిగూడ, నల్లకుంట కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్ యాదవ్, వై.అమృత ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో యాత్రకు స్వాగతం పలికారు. మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, నేతలు శ్యామ్‌రాజ్, జి.కావ్యా కిషన్‌రెడ్డి, ఆనంద్ కుమార్ గౌడ్, ఎ.సూర్య ప్రకాష్ సింగ్, కేసరి నర్సింగ్ యాదవ్, చిట్టి శ్రీధర్, అడప చంద్రమౌళి, ఎ.యశ్వంత్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, కుమ్మరి ప్రవీణ్, సునిల్, కృష్ణాగౌడ్, అనుహ్యారెడ్డి, ఆకుల విజయ, అరవింద్, శిరీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసంరక్షణలో నిర్లక్ష్యం తగదు



వైద్య సేవలు అందిస్తున్న మెడికోవర్ హాస్పిటల్ వైద్య బృందం

కాచిగూడ: ప్రజలు ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో మెడికోవర్ బేగంపేట బ్రాంచి వైద్య సిబ్బంది రోగులకు సేవలు అందించారు. నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అనంతరం అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఐ చెకప్, డెంటల్ చెకప్ చేశారు. కార్యక్రమంలో మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి హెడ్ రాజ్ కుమార్, మేనేజర్ వినోద్ కుమార్, సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం అందరికీ దక్కాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వెంకట్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: విద్యా, వైద్యం ప్రాథమిక హక్కు అని ఇది ప్రతిఒక్కరికీ ఉచితంగా దక్కాలని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'దయల్ యువర్ విలేజ్'సభ్యుడు మేరేటి రవి ఆధ్వర్యంలో జరిగిన పాలమూరు యాత్ర ముగింపు సందర్భంగా సామాజిక కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మందికి వైద్యం అందని దుస్థితి ఏర్పడిందన్నారు. దయల్ యువర్ విలేజ్ సభ్యులు ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 29 వరకు 11 రోజులపాటు పాలమూరు యాత్రను విజయవంతంగా చేపట్టి ఆయా ప్రాంతాల్లో విద్యా, వైద్యం, మరుగుదొడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిశీలించారని తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి దనసిరి ప్రకాష్, సి.హెచ్.లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, రవి మేరేటి, ఎస్.జనార్ధన్, కన్కె గంటి రవి తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు కోసం బీజేపీకి ఓటు వేయాలి



విజయసంకల్పయాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సభకు హాజరైన ప్రజలు

అంబర్‌పేట: రాబోయే పార్లమెంటు ఎన్నికలు దేశ అభ్యున్నతి, ప్రతిష్టను నిలబెట్టే ఎన్నికలని, వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆలోచించి బీజేపీకి ఓటు వేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కోరారు. శనివారం అంబర్‌పేటలో జరిగిన విజయసంకల్ప యాత్ర ముగింపుసభలో ఆయన మాట్లాడారు. ఇదివరకు కాంగ్రెస్ చేసిన అవినీతిని, ప్రధాని మోదీ ప్రభుత్వం మచ్చలేని పాలనను గమనించాలని ప్రజలను కోరారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో మౌలిక రంగాలకు పెద్ద పీటవేసి అన్ని రంగాలను అభివృద్ధి చేసిందన్నారు. భయానకమైన కరోన మహమ్మారిని ప్రధాని నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని చెప్పారు. ప్రపంచ దేశాలు కరోనా టీకాను డబ్బులకు ఇస్తే మన కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని పేర్కొన్నారు. ఆర్టికల్ 370, త్రిపుల్ తలాక్, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి సాహసోపేత నిర్ణయాలను తీసుకున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కిషన్‌రెడ్డి కోరారు. ఇక బీఆర్ఎస్ పార్టీ కాలం చెల్లిన పార్టీ అని దానికి ఓటు వేస్తే అంబర్‌పేట పక్కన ఉన్న మూసీ నదిలో వేసినట్లేనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఫాంహౌస్‌కు తప్ప దేనికీ పనికిరాడని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సైతం రోజు రోజుకు దేశంలో కనుమరుగు అవుతుందన్నారు. ఢిల్లీ నేతలకు సూట్‌కేసులు పంపించే పనిలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే వ్యవసాయం, మహిళ సాధికారికత, యువత అభ్యున్నతి, పేదల ప్రజల అభ్యున్నతి వంటి గ్యారెంటీలను మోదీ అమలు చేస్తారని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, రాకేష్‌రెడ్డి, సూర్యనారాయణ గుప్త, నాయకులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ లలిత్‌కు అభినందన



కాచిగూడ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.లలిత్ శనివారం ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, ఎస్.రాంచందర్‌రావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.